క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో గోదాదేవికి పూజలు



విశేష అలంకారంలో శ్రీ గోదాదేవి సమేత సత్యనారాయణస్వామి

కడప కల్చరల్ : ధనుర్మాసాన్ని పురస్కరించుకుని 9వ రోజు మంగళవారం శ్రీ గోదామాతకు విశేష పూజలు నిర్వహించారు. కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మీసత్యనారాయణస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో ఈ పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున స్వామికి ఆరాధన, సాలాగ్రామ పూజలు, సామూహిక విష్ణు సహ స్ర నామ పారాయణం, తిరుప్పల్లాచ్చి, తిరుప్పావై 30 పాశురాలు, తిరువారాధన, మహా నివేదన, కుంభ, నక్షత్ర హారతులు, చతుర్వేద స్వస్తి తదితర పూజలను నిర్వహించారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా జెండా ఉత్సవాలు

కడప కల్చరల్ : కడప నగరంలోని దేవుని కడప రోడ్డులోని హజరత్ ఖాదర్ వలీ సాహెబ్ జెండా ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రముఖులు రహమతుల్లా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఫకీర్ల మేళతాళాల మధ్య, సాహస విన్యాసాలతో జెండాను ఊరేగింపుగా తెచ్చి ప్రతిష్ఠించారు. అనంతరం ఫాతెహా నిర్వహించి భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

కడప సెవెన్‌రోడ్స్ : మహా కవయిత్రి మొల్ల సాహితీ పీఠం రూపొందించిన 2025 నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు మంగళవారం ఆవిష్కరించారు. డీఆర్వో కార్యాలయంలో పీఠం వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత విద్వాన్ గానుగపెంట హనుమంతరావుతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జనవరిలో బద్వేలులో నిర్వహించే తెలుగు సాహితీ యాత్రలకు డీఆర్‌ఓను హనుమంతరావు ఆహ్వానించారు.

విరాళం అందజేత

వైవీయూ: త్రివిధ దళాల సాయుధ పతాక దినోత్సవం సందర్భంగా మాజీ సైనికులు, వితంతువులు, వారి కుటుంబసభ్యులకు చేయూతనందించే ఫ్లాగ్ డే నిధికి మేజర్ సి. విజయభాస్కర్ విరాళం అందజేశారు. రాజంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్ డిసెంబర్ 7వ తేదీన పతాక దినోత్సవం సందర్భంగా సేకరించిన విరాళాలను జిల్లా సైనిక సంక్షేమాధికారి కార్యాలయంలో మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా మేజర్ సి. విజయభాస్కర్ మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్ డా. పురుషోత్తం, ఎన్‌సీసీ సీటీఓ నరేష్ బెహ్రాల సహకారంతో ఎన్‌సీసీ కేడెట్స్ సేకరించిన విరాళాలను అందజేశామన్నారు. ఈ సందర్భంగా జిల్లా సైనిక సంక్షేమశాఖ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు ఫ్లాగ్ డే నిధికి విరాళం అందజేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

నేడు, రేపు వెంకటేశ్వర స్వామి కల్యాణం

కడప కల్చరల్ : శ్రీ గోవిందమాల భక్తబృంద సేవా సమితి ఆధ్వర్యంలో బుధ, గురువారాల్లో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. నగరంలోని మున్సిపల్ స్టేడియంలో ఈ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 5 గంటల నుంచి సుప్రభాతం, తోమాల సేవ, గోపూజ నిర్వహిస్తారు. అన్నమాచార్య విగ్రహం వద్ద నుంచి స్వామి కల్యాణోత్సవానికి భక్తబృందం ఊరేగింపుగా సారె తీసుకు రానున్నారు. అనంతరం కల్యాణ వేదిక వద్ద వస్త్రాలంకార సేవ, నిశ్చితార్థం నిర్వహిస్తారు. మధ్యాహ్నం మంగళ స్నానం, అలంకారం, ఎదుర్కోలు ఉత్సవం నిర్వహిస్తారు. గురువారం ఉదయం 5 గంటలకు సుప్రభాతంతో రెండవరోజు కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. ఉదయం 9 గంటలకు శ్రీనివాస కల్యాణాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటలకు గ్రామోత్సవంలో గరుడ సేవ జరగనుంది.

అమర గాయకుడు మహమ్మద్ రఫీ

కడప ఎడ్యుకేషన్: అమర , మధురమైన గాయకుడు మహమ్మద్ రఫీ అని ఆయన జయంతి, వర్ధంతిని రాష్ట్ర ప్రభుత్వమే నిర్వహించాలని ప్రముఖ గాయకులు నజీర్ అహ్మద్ అన్నారు. కడప నగరం 2వ గాంధీ బొమ్మ వద్ద ఉన్న రాయల్ రషీద్ అసోసియేషన్ కార్యాలయంలో మహమ్మద్ రఫీ శత జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో యునైటెడ్ ముస్లిం ఫోరం రాష్ట్ర కార్యదర్శి రఫీఖాన్, ప్రముఖ హోమియో వైద్యులు బి శ్రీనివాసులు, ఆర్‌ఆర్ సంస్థ అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరీముల్లా. సంగీత కళాభిమానులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వెలుగులు



విద్యుత్ దీపకాంతుల్లో నూతన శోభను సంతరించుకున్న కడప నగరంలోని మరియాపురం చర్చి (ఇన్‌సెట్) మరియాపురం చర్చిలో మంగళవారం రాత్రి ప్రసంగిస్తున్న పీఠాధిపతి గాలిబాలి, ఫాదర్లు ఈరి మరియన్న, సురేష్, బాలరాజు

కడప కల్చరల్ : క్రిస్మస్ పండుగను ఆహ్వానిస్తూ కడప నగరంలోని పలు చర్చిల ఆధ్వర్యంలో పండుగ ఆహ్వాన ర్యాలీలు నిర్వహించారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం ప్రకాశ్‌నగర్‌లోని సియోన్ ప్రార్థనా మందిరం ఆధ్వర్యంలో విశ్వాసులు ఎర్రముక్కపల్లె, కోటిరెడ్డిసర్కిల్, ఆర్టీసీ బస్టాండుల మీదుగా ర్యాలీ నిర్వహించారు.

లోక రక్షకుడి బాటలో నడవాలి

కడప సెవెన్‌రోడ్స్ : శాంతి, రక్షణ,దయా గుణానికి ప్రతిరూపమైన లోకరక్షకుడు ఏసుప్రభు సూచించిన సన్మార్గంలో నడవాలని కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ పేర్కొన్నారు. క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకొని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మేనేజర్ అరుణ్ కుమార్‌తో కలిసి మంగళవారం కడపలోని అమ్మ ఒడి అనాథ విద్యార్థులకు అల్పాహారం అందించారు. అలాగే బృంద వృద్ధాశ్రమం, పద్మావతి వృద్ధాశ్రమాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. వీటితోపాటు జువెనైల్ హోమ్ విద్యార్థులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు.

మెర్సీ ఆశ్రమంలో మినీ క్రిస్మస్

కడప కల్చరల్ : కడప నగర శివార్లలోని తోళ్లగంగన్నపల్లె వద్దగల మెర్సీ కరుణామయ ఆశ్రమంలో మంగళవారం మినీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రముఖ జ్యోతిష్య నిపుణులు ఎం.సురేష్‌బాబు ముఖ్య అతిథిగా హాజయ్యారు. క్రీస్తు బాటలో మనమంతా నడవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన క్రిస్మస్ కేక్ కట్ చేసి బాలలకు అందజేశారు. అలాగే వారికి నూతన వస్త్రాలు, స్కూలు బ్యాగులు, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. ఆ తర్వాత కార్యక్రమానికి హాజరైన వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో పాదర్లు విజయరావు, చంద్ర, సుధాకర్, జనార్దన్, సవారియ, మరియ, నరసింహా, రెడ్డికుమార్, మున్నా, స్తోత్రరాజ్, జాన్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలు

కడప సెవెన్‌రోడ్స్ : ప్రేమ, శాంతి, దయాగుణం కలిగి మానవాళిని సన్మార్గంలో నడిపించడానికి ఏసుప్రభు జన్మించారని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏసుప్రభు మార్గంలో ప్రతి ఒక్కరు నడవాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి విశ్వేశ్వర నాయుడు, అనంతరం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి మాట్లాడారు. అంతకుముందు క్రిస్మస్ ట్రీకి లైట్ వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఇమ్రాన్, క్రైస్తవ మత పెద్దలు శామ్యూల్, విజయ భాస్కర్, ప్రభుదాస్, జాన్, మహేష్, టీడీపీ ఎస్టీ సెల్ నాయకులు రమేష్ రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఏసు కరుణామయుడు

కడప ఎడ్యుకేషన్: యేసుక్రీస్తు కరుణామయుడు, దయామయుడని పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ యంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. కడప అక్కాయపల్లెలోని సాయిబాబా విద్యాసంస్థలో మంగళవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. మరో అతిథి 46వ డివిజన్ కార్పొరేటర్ యంవీ శ్రీదేవి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.

నారాయణ పాఠశాలలో ...

బిల్టప్ సర్కిల్ దుర్గమ్మ ఆలయం దగ్గర ఉన్న నారాయణ పాఠశాల సిడిపి–విడిటిలో క్రిస్మస్ ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల ఏజీఎం చెన్న కేశవరాజు క్రిస్మస్ ప్రాముఖ్యత గురించి వివరించారు.

ప్రత్యేక ప్రార్థనలు



మరియాపురం చర్చిలో మంగళవారం అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చారు. గురువులు క్రిస్మస్ ప్రాముఖ్యత వివరించారు.



విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి



సెమీ క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి



చిన్నారులకు దుస్తులు అందజేస్తున్న జ్యోతిష్య నిపుణులు సురేష్‌బాబు



కడప నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఘనంగా ఈశ్వరీదేవి ఆరాధన



ఆరాధన ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరంలో శ్రీ ఈశ్వరీదేవి ఆరాధన గురుపూజ మహోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బిల్టప్ సమీపంలోని హోమియోపతి కళాశాల వద్ద ఉన్న ఆచార్ల కాలనీలో వెలసిన బ్రహ్మంగారి దేవాలయంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఆలయానికి ఈశ్వరీదేవి ఉత్సవ విగ్రహాన్ని వెదురూరి గురుబ్రహ్మ ఆచారి, విజయలక్ష్మి దంపతులు సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉత్సాహ భరితంగా గ్రామోత్సవం జరిగింది. కాలనీతోపాటు చుట్టు పక్కల ప్రాంతాల ప్రజలు, భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత ముఖ్యం

వైవీయూ: యోగి వేమన విశ్వ విద్యాలయం జాతీయ సేవా పథకం యూనిట్–9 ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం వైవీయూ వెస్ట్ క్యాంపస్ కంప్యూటర్ సైన్స్, కామర్స్, బిజినెస్ మేనేజిమెంట్ బిల్డింగ్స్ పరిసరాలలో ఉన్న ముళ్ల చెట్లను, ప్లాస్టిక్స్ వేస్టేజి, కలుపు మొక్కలను తొలగించారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుతున్నామన్నారు. అందరం కలసి ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ బి. విజయభారతి, డా. క్రిష్ణయ్య , నారాయణరెడ్డి , డా. రఫీ, డా. రజని పాల్గొన్నారు.

ధ్యానంతో ప్రయోజనం

వైవీయూ: మన మనస్సు ఆందోళన నుండి విముక్తి పొందేలా ప్రశాంతత, శాంతి ధ్యానం వల్ల కలుగుతుందని దివ్య బాబాజీ సుషుమ్నా క్రియా యోగా ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ అల్లూరి ఉమాదేవి, ప్రతినిధి మాధురి లక్ష్మి అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుషుమ్నా క్రియ అనేది 4 రకాల ధ్యానాల కలయిక అని వివరించి అవగాహన కల్పించారు. ధ్యానం ద్వారా కలిగే ప్రయోజనాలు వివరించారు. జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో మైథిలి మాట్లాడుతూ ప్రశాంతతతో కూడిన మనస్సు, ఏకాగ్రత, అవగాహన స్పష్టత, సమాచార అభివృద్ధి, మానసిక నైపుణ్యాలు ధ్యానం వల్ల వృద్ధి చెందుతాయన్నారు. వసతి గృహంలో విద్యార్థులచే ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి డా.అనూ ప్రసన్న విద్యార్థులు, సిబ్బంది, వసతి గృహ కార్మికులు పాల్గొన్నారు.

టీడీపీ నీచ రాజకీయాలు చేస్తోంది



మీడియాతో మాట్లాడుతున్న కడప మేయర్ సురేష్‌బాబు

వేంపల్లె : టీడీపీ నేతలు నీచ రాజకీయాలు చేస్తూ మా వైఎస్సార్‌సీపీ కుటుంబంలో చిచ్చు పెట్టేందుకు సిద్ధమయ్యారని కడప మేయర్ సురేష్‌బాబు మండిపడ్డారు. మంగళవారం పులివెందుల పర్యటనకు వచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసిన అనంతరం సురేష్‌బాబు మీడియాతో మాట్లాడారు. ఎప్పుడూ కూడా మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉంటామన్నారు. కార్పొరేటర్లను, మమ్ములను వివిధ రకాలుగా టీడీపీ నేతలు ఇబ్బందులకు గురి చేస్తున్నారని.. మేము ఎవరికీ భయపడమన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా ఇడుపులపాయలోని క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారన్నారు. ఆయన్ను కలిసేందుకు వచ్చామే తప్ప ఎటువంటి అనుమానాలు లేవన్నారు. ఆయనకు, వారి కుటుంబ సభ్యులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపామన్నారు.

టీడీపీ నేతలు మైండ్ గేమ్ ఆడుతున్నారు :

టీడీపీ నేతలు మైండ్ గేమ్ ఆడుతున్నారని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు అందరూ టీడీపీలోకి వెళ్తున్నట్లు ప్రచారం చేస్తున్నారని.. ఎటువంటి పరిస్థితుల్లో కూడా టీడీపీలోకి చేరే ప్రసక్తే లేదన్నారు. వైఎస్సార్‌సీపీకి ఎల్లప్పుడూ అండగా ఉంటాం. గతంలో కలిసికట్టుగా పనిచేసి రాష్ట్రంలో 151 సీట్లు సాధించాం. అలాగే ఇప్పుడు కూడా వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటూ కలిసికట్టుగా పనిచేస్తాం. టీడీపీ అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తి కావచ్చినా ఏ వర్గ ప్రజలకు కూడా న్యాయం జరగలేదన్నారు. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా న్యాయంగా పోరాటం చేస్తామన్నారు.

వేడుకగా క్రీడాదినోత్సవం



స్పోర్ట్స్‌డే వేడుకల్లో క్రీడాకారులతో వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, క్రికెటర్ సుదర్శన్

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన వైవీయూ వైస్‌చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ఐపీఎల్ క్రీడాకారుడు కె. సుదర్శన్‌లకు పాఠశాల ఎన్‌సీసీ కేడెట్స్, క్రీడాకారుల నుంచి గౌరవ వందనం లభించింది. అనంతరం అతిథులు ఒలంపిక్ టార్చ్ ప్రారంభించి, క్రీడా ప్రతిజ్ఞ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక, మానసిక ఉల్లాసంతో పాటు మనోధైర్యం ఉంటుందన్నారు. ఐపీఎల్ క్రీడాకారుడు, జిల్లాకు చెందిన రంజీ క్రికెటర్ కె. సుదర్శన్ మాట్లాడుతూ క్రీడాకారులు లక్ష్యం నిర్దేశించుకుని సాధించేందుకు శ్రమించాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ యు. శ్రీనివాసమూర్తి , పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్. రహమతుల్లా పాఠశాల విద్యార్థులు సాధించిన క్రీడాప్రగతిని వివరించారు. ప్రోగ్రాం ఇన్‌చార్జి బేగం, ఫిజికల్ డైరెక్టర్లు తిరుమలశెట్టి ప్రసాద్, టి. సునీత, బి. భీమయ్య తదితరులు క్రీడాదినోత్సవ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. అనంతరం వివిధ క్రీడాంశాల్లో రాణించిన క్రీడాకారులకు అతిథుల చేతుల మీదుగా మెడల్స్ అందజేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కారానికి చర్చ జరగాలని, సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కడప నగరం మౌలిక వసతులకు ఆమడ దూరంలో ఉందన్నారు. కడప నగర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఎమ్మెల్యే మాధవి రెడ్డి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్ నాగ సుబ్బారెడ్డి, నగర సహాయ కార్యదర్శులు కేసీ బాదుల్లా, జి. మద్దిలేటి పాల్గొన్నారు.

కుర్చీ తగాదా ఆపండి..

కడప ఎమ్మెల్యే మాధవిరెడ్డి నగరపాలక జనరల్ బాడీ సమావేశంలో కుర్చీ కోసం తగాదా పడుతున్నారని.. ఆ విషయం ఆపి ప్రజల సమస్యలపై దృష్టి పెట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి జకరయ్య, మహ్మద్ ఆలీఖాన్ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఇందిరాభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలు అన్ని విషయాలు గమనిస్తున్నారని , తగిన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సిరాజుద్దీన్, హరిప్రసాద్ పాల్గొన్నారు.

దుర్గమ్మకు పట్టు వస్త్రాల సమర్పణ



విజయదుర్గమ్మ సన్నిధిలో రవీంద్రనాథ్ రెడ్డి దంపతులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయదుర్గాదేవికి మంగళవారం వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు పి.రవీంద్రనాథ్‌రెడ్డి దంపతులు పట్టు వస్త్రాలను అందజేశారు. ఆలయానికి విచ్చేసిన రవీంద్రనాథ్‌రెడ్డి, అరుణమ్మ దంపతులకు ఆలయ నిర్వాహకులు ఘనంగా స్వాగతం పలికారు. తమ వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయానికి విచ్చేసిన ఆ దంపతులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించి పట్టు వస్త్రాలను అర్చకుల ద్వారా సమర్పించారు. అర్చకులు వారికి వేదాశీస్సులు, తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు అందజేశారు.

దోష నివారణ పూజలు

కడప నగరం శ్రీ విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం భక్తులు దోష నివారణ కోసం రాహుకాల పూజలను నిర్వహించారు. తొలుత అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహికంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. నిర్వాహకులు సుధా మల్లికార్జునరావు, దుర్గాప్రసాద్ భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ప్రతిభావంతులకు కేతు స్మారక బంగారు పతకం



వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డికి చెక్కు అందజేస్తున్న కేతు కుటుంబసభ్యులు

వైవీయూ: సుప్రసిద్ధ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి పేరిట యోగివేమన విశ్వవిద్యాలయంలో ప్రతిభావంతులకు బంగారు పతకాలు ఇవ్వనున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు ప్రకటించారు. ×ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి స్మారక బంగారు పతకం₹ పేరిట పోస్ట్ గ్రాడ్యుయేషన్ తెలుగు శాఖలో ప్రతిభ చూపిన విద్యార్థికి బంగారు పతకం , నగదు బహుమతి ఇవ్వాలని ఆచార్య కేతు విశ్వనాథ రెడ్డి సతీమణి కేతు పద్మావతి, కుమారుడు కేతు శశికాంత్, కుమార్తెలు కె. మాధవి, కె. శిరీష కోరారు. కడప నగరం సింగపూర్ టౌన్‌షిప్‌లోని కేతు విశ్వనాథరెడ్డి నివాసంలో వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డిని, తెలుగుశాఖ అధిపతి ఆచార్య ఎం.ఎం.వినోదినిని ఆహ్వానించి చర్చించారు. అనంతరం రూ. 2.50 లక్షల చెక్కును వీసీకి అందజేశారు.

రికార్డుల పరిశీలన



రికార్డులను తనిఖీ చేస్తున్న కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప అర్బన్: కడప నగరంలోని టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్‌లోని పలు రికార్డులు, కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితుల రికార్డులను పరిశీలించి ప్రస్తుతం వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులు, ఫోక్సో కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డీఎస్పీ మాట్లాడుతూ యువత రాత్రి వేళల్లో తిరుగుతుంటారని, వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గంజాయి విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కడప నగరంలో పోలీస్ 30 యాక్ట్ అమల్లో వుందని, అనుమతులు లేకుండా సభలు నిర్వహించినా, ర్యాలీ నిర్వహించినా కేసు నమోదు చేయాలని ఆదేశించారు. డిసెంబర్ 31 రాత్రి ఎక్కడా అల్లర్లు జరుగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడిపితే ఆ వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐ నాగార్జున, ఎస్ఐ ఎస్‌కెఎం హుసేన్‌లు పాల్గొన్నారు.

పైపులైన్ లీకేజీ అరికట్టాలి



లీకేజీతో రోడ్డుపై వృధాగా పోతున్న నీరు

కడప కార్పొరేషన్: కడప నగరం రామాంజనేయపురం పరిధిలోని వరదకాలనీలో మూడు చోట్ల పైపులైన్ లీకేజీల వల్ల తాగునీరు వృథా అవుతోంది. వారం రోజులుగా నీరు వృధాగా పోతున్నా కార్పొరేషన్ సిబ్బంది పట్టించుకోలేదు. ఇక్కడ సీసీ రోడ్డు నిర్మాణం నిమిత్తం టిప్పర్లతో కంకర, ఇసుక తోలే క్రమంలో ఈ లీకేజీలు ఏర్పడ్డాయి. అటు కాంట్రాక్టర్ గానీ, ఇటు కార్పొరేషన్ సిబ్బందిగానీ వీటి గూర్చి పట్టించుకోలేదని స్థానికులు విమర్శిస్తున్నారు. సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పేదల సామాజిక సమానత్వమే ధ్యేయం



మాట్లాడుతున్న హిందూస్తాన్ ఆవాం మోర్చా పార్టీ చీఫ్ సెక్రటరీ రాజేష్ పాండే

కడప రూరల్ : పేద వర్గాలకు సామాజిక సమానత్వమే తమ ధ్యేయమని హిందూస్తాన్ ఆవాం మోర్చా పార్టీ చీఫ్ సెక్రటరీ రాజేష్ పాండే తెలిపారు. మంగళవారం స్థానిక కింగ్‌ప్యాలెస్ కల్యాణ మండపంలో ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద వర్గాలను ఏకం చేసి రాజ్యాధికారం సాధన దిశగా పార్టీ పనిచేస్తోందన్నారు. ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల ఆర్థికాభివృద్ధే తమ సంకల్పమని పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులుగా అస్గర్ అలీ తదితరులను నియమించారు. ఈ కార్యక్రమంలో రాజేష్, సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎక్సైజ్ సీఐ కృష్ణ మోహన్

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నాటు సారా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ కృష్ణకుమార్ పేర్కొన్నారు. మంగళవారం చింతకొమ్మదిన్నె మండలం గుర్రంగుంపు తండాలో నవోదయం కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారా తయారు చేసి అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు నరసింహ రావు, నారాయణ రెడ్డి, సర్పంచ్ సుబ్బరాయుడు పాల్గొన్నారు.

వినతి

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌తోపాటు వసతి దీవెన డబ్బులు విడుదల చేసే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న కోరారు. ఈ విషయమై మంగళవారం కడప పర్యటనకు విచ్చేసిన మంత్రి రాంప్రసాద్ రెడ్డిని కలిసి పీడీఎస్‌యూ నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు.